ఆక్రమణలపై ఉక్కుపాదం



కెనాల్‌పై అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు

- డీ–36 కాల్వపై అక్రమ కట్టడాల కూల్చివేత
- కఠిన చర్యలు తప్పవు

చిన్నంబావి: మండలంలోని డీ–36 కెనాల్‌ను ఆక్రమించి నిర్మించిన కట్టడాలపై అధికారులు ఉక్కుపాదం మోపారు. మండలంలోని డీ–36ను కాల్వను కబ్జాచేసి అక్రమంగా దుకాణాలను నిర్మించారని వరుసగా ఫిర్యాదు రావడంతో అధికారులు గురువారం స్పందించారు. గత కొన్నేళ్లుగా ఈ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికుల నుంచి వరుస ఫిర్యాదు రావడంతో చివరికి అక్రమంగా నిర్మించిన వాటిని తొలగించారు.

అక్రమ నిర్మాణాలు ఇలా..

చిన్నంబావి మండల కేంద్రంగా ఏర్పడిన నాటి నుంచి మండల కేంద్రంలో అక్రమ నిర్మాణాలు ఎక్కువయ్యాయి. భూములకు విలువ పెరగడంతో దేవాదాయ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఇవి చాలవన్నట్టు కాల్వలను సైతం యథేచ్ఛగా కబ్జా చేసి కమర్షియల్ భవనాలను, దుకాణాలను, ఇళ్లను అక్రమంగా నిర్మించారు. డీ–36, డీ–4 కాల్వలను యథేచ్ఛగా కబ్జా చేసి దుకాణాలను, భవనాలను నిర్మించారు. దీంతో దిగువన పంటలను సాగు చేస్తున్న రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు పడ్డారు. వీటిపై చర్యలు తీసుకోవాలని గతంలో అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఇన్నాళ్లకు మోక్షం కలిగినట్టైంది. పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించి సాగునీరు అందేలా చూడాలని కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదు

డీ–36 కెనాల్‌ను ఆక్రమించి తొమ్మిది దుకాణాలు నిర్మించిన వారికి తెలంగాణ ల్యాండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్ సెక్షన్ 7 ప్రకారం నెలరోజుల ముందే నోటీసులు అందజేశామని దుకాణాలు అక్రమంగా నిర్మించడంతో వాటిని తొలగించాం. త్వరలో మరి కొన్ని వాటిని కూడా తొలగించేలా చర్యలు తీసుకుంటాం

–శ్రీనివాస్, తహసీల్దార్, చిన్నంబావి

సమయం ఇవ్వలేదు

మండల కేంద్రంలో కాల్వలను కబ్జా చేసి నిర్మించినట్లయితే మాకు కొంత సమయం కావాలని అడిగాం. ఒకవేళ అక్రమంగా నిర్మించినట్లయితే జూరాల అధికాలతో సమాచారం తీసుకొని తొలగిస్తాం.కానీ కావాలనే కక్షసాధింపుతో దుకాణాలను తొలగించారు. నాకు కొంత సమయం ఇవ్వండి అని వేడుకున్న వినలేదు.

–మారం సతీష్, బాధితుడు

ఆక్రమణలు తొలగింపు..

మండలకేంద్రంలో డీ–36 కెనాల్, డీ–4 కాల్వల వెంబడి అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను అధికారులు తొలగిస్తున్నారు. డీ–36 కెనాల్‌ను ఆక్రమించి నిర్మించిన తొమ్మిది దుకాణాలను గురువారం రెవెన్యూ సిబ్బంది, పోలీసుసిబ్బంది తొలగించారు. త్వరలో మరికొన్ని వాటిని కూడా తొలగించేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు పేర్కొన్నారు.

బాధితుల ఆవేదన ..

మండల కేంద్రంలో నిర్మించిన కట్టడాలు అక్రమమైతే ఏడేళ్లుగా ఏం చేశారని బాధితులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. కావాలనే కొంతమందిని టార్గెట్ చేసి కక్షసాధింపుతో దుకాణాలను కూలుస్తున్నారని బాధితులు వాపోయారు. ప్రతిది అక్రమంగా నిర్మించారని మరి వాటిపై చర్యలు తీసుకుంటార అని అధికారులను ప్రశ్నించారు.

క్లుప్తంగా

పోలీస్ పెట్రోల్‌బంక్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వనపర్తి: రాజపేట సమీపంలో ఇటీవల పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్‌బంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గురువారం వీటికి సంబంధించి వాల్‌పోస్టర్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వరరావు, స్పెషల్‌బ్రాంచ్ సీఐ నరేష్, సీఐ రవిపాల్, సీఐలు అప్పలనాయుడు, శ్రీనివాస్, ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి ఉన్నారు.

పిల్లలపై శ్రద్ధ చూపాలి

కొత్తకోట: తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర మూర్తి అన్నారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. కళాశాలకు, పాఠశాలకు వెళ్తున్నారా? లేదా ఆయా కళాశాల, పాఠశాల ప్రిన్సిపల్స్‌ను అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా తప్పనిసరిగా తల్లిదండ్రుల సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు.

స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు కావాలి

కొత్తకోట రూరల్: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ''స్వచ్ఛత హై సేవ–స్వచ్ఛ ఉత్సవ్'' కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ సైదయ్య అన్నారు. గురువారం పట్టణంలో ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. పురపాలక సంఘ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి వెంకటగిరి ఆలయం రోడ్ వరకు చేరుకున్నారు.

అభివృద్ధికి సహకరించాలి

ఆత్మకూర్: పట్టణంలో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ప్రజల భాగస్వామ్యం కావాలని మున్సిపల్ కమిషనర్ చికినే శశిధర్ అన్నారు. గురువారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో అధికారులు, కార్మికులతో కలసి స్వచ్ఛాతాహీ సేవలో భాగంగా ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు.

ఆరాధనోత్సవాలకు మంత్రికి ఆహ్వానం

అమరచింత: నాగల్‌కడ్మూర్‌లో విశ్వకర్మ జగద్గురు దేవేంద్రచార్య ఆరాధనోత్సవాలకు హాజరు కావాలని మంత్రి వాకిటి శ్రీహరికి మఠం నిర్వాహకులు ఆహ్వానపత్రాన్ని గురువారం అందించారు. నిర్వాహకుడు నరసింహచారి మాట్లాడుతూ.. అక్టోబర్ 11 నుంచి 13 వరకు ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. వాల్‌పోస్టర్‌ను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించామన్నారు. కార్యక్రమంలో రామకృష్టారెడ్డి, జగన్‌రెడ్డి, నరసింహారెడ్డి, పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



అమరచింత: పురపాలికకు రూ.15 కోట్లను మంజూరు చేసినందుకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి చిత్రపటానికి గురువారం పాలాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిలో ముందుకెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, పార్టీ పట్టణ, మండల అధ్యక్షుడు అరుణ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్‌లు విష్ణు, శ్యాం, మోహన్, కమలాకర్‌గౌడ్, నాయకులు తిరుమలేష్, మహాంకాళి విష్ణు, హనుమంతు నాయక్, తౌఫిక్‌లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

వనపర్తి రూరల్: జాతీయ రహదారిపై ఆగిన కారును వెనుకనుంచి ట్రక్కు ఢీకొట్టడంతో పలువురి స్వల్ప గాయాలైన ఘటన చోటు చేసుకున్నది. పెబ్బేరు ఎస్‌ఐ దివ్య తెలిపిన వివరాల ప్రకారం.. వీపన్‌గండ్ల మండలానికి చెందిన గంగిరెడ్డి జిల్లా కేంద్రంలోని బండారు నగర్‌లో నివాసం ఉంటున్నాడు. అతడికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో కుటుంబ సభ్యులతో కలసి గురువారం ఉదయం కారులో కర్నూల్ ఆసుపత్రికి బయలుదేరాడు. ఆసుపత్రిలో చూపించుకొని తిరుగు ప్రయాణంలో పెబ్బేరు దగ్గర జాతీయ రహదారిపై పెబ్బేరులోకి వెళ్లడానికి రోడ్డు దాటడానికి కారు ఆపాడు. వెనుకనుంచి వస్తున్న ట్రక్కు ఢీకొట్టడంతో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. విజయ్‌కుమార్ రెడ్డి ఫిర్యాదు మేరకు గురువారం కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ దివ్య తెలిపారు.

గొప్ప సంఘసంస్కర్త పండిట్ దీన్‌దయాళ్



కంచిరావుపల్లి తండాలో మొక్క నాటుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

వనపర్తి రూరల్: గొప్ప సంఘ సంస్కర్త పండిట్ దీన్‌దయాళ్ అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పెబ్బేరు మండలంలోని కంచిరావు పల్లితండాలో బూత్ అధ్యక్షుడు భాస్కర్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం దీన్‌దయాళ్ జయంతిని నిర్వహించారు. జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకట్రామరెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అమ్మవారి ఆలయంలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో సుదీర్‌రెడ్డి, భాస్కర్‌నాయక్, బీచుపల్లినాయక్, తిరుపతి పాల్గొన్నారు. వనపర్తి మండల అధ్యక్షుడు సందా వెంకటేష్ ఆధ్వర్యంలో చిట్యాల, అంజనగిరి జయంతి నిర్వహించారు. ఆయనవెంట మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, క్యాడ గిరికుమార్, యాదగిరి, అంజినాయుడు, రమేష్, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

అమరచింత: దీన్‌దయాల్ దేశానికి చేసిన సేవలను స్మరిస్తూ బీజేపీ మండల అధ్యక్షురాలు మంగ లావణ్య అన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మరాఠి ఆశోక్, వినోద్‌కుమార్, విజయ్‌యాదవ్, క్యామ భాస్కర్, తిరుమల పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలో ఆయా గ్రామాల్లో దీన్‌దయాళ్ జయంతిని బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ఇంచార్జి సీతారాములు, మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఆశన్న, జిల్లా పంచాయతీసెల్ కన్వీనర్ విక్రం, గోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, శేఖర్, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

పాన్‌గల్: పీఎం నరేంద్రమోదీ జన్మదిన వేడుకల్లో అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించే సేవాపక్షంలో ప్రతి కార్యకర్త పాల్గొని పనిచేయాలని నియోజకవర్గ ఇంచార్జి ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. సేవా పక్షంలో భాగంగా గురువారం మండలంలోని కేతేపల్లి గ్రామంలో పాల్గొని మొక్కలు నాటారు. దీన్ దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కో కన్వీనర్ అన్వేష్, ప్రవీణ్, రమేష్, శివరాంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలి



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీఓ బన్సీలాల్

వీపనగండ్ల: గతంలో జారీ అయిన ఇప్పటి ఓటరు జాబితాలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలని కొల్లాపూర్ ఆర్డీఓ బన్సీలాల్ అన్నారు. గురువారం తాసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలు చేస్తున్న ఓటరు జాబితా సర్వేలను ఆయన పరిశీలించారు. 2002 సంవత్సరం జాబితా, 2025 జాబితా చనిపోయి, వలసవెళ్లి వారిని గుర్తించాలని ఆయన రెవెన్యూ అధికారుల ఆదేశించారు. 18 ఏళ్ల నుంచి 21,22 నుంచి 38,39 నుంచి 100 సంవత్సరాల వయస్సు ఉన్న ఓటర్లను గుర్తించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తాసీల్దార్ వరలక్ష్మి, డిప్యూటీ తాసీల్దార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అనితను అభినందిస్తున్న సంతోష



కీర్తన

ఆత్మకూర్: రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ కబడ్డీ పోటీలకు ఆత్మకూర్‌కు చెందిన 9 వతరగతి విద్యార్థినులు అనిత, కీర్తి ఎంపికయ్యారని ఫిజికల్ డైరక్టర్ సంతోషమురళి తెలిపారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతిలో విద్యను అభ్యశిస్తున్న అనిత, కీర్తి జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభను చాటారు. నిజామాబాద్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బాలరాజు, మార్కెట్ చైర్మన్ రహ్మతుల్లా మోహన్‌ను అభినందించారు.

నిబంధనలు తప్పనిసరి

ఆత్మకూర్: సురక్షిత ప్రయాణంతో క్షేమంగా ఉంటామని, ట్రాఫిక్‌రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని సీఐ శివకుమార్, ఎస్సై నరేందర్ అన్నారు. గురువారం రాత్రి కొత్తకోట వై జంక్షన్‌వద్ద వాహనదారులకు, ప్రయాణికులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రోషయ్య, సిబ్బంది సత్యం, సురేందర్, శ్రీహరి, మోహన్, వాహనదారులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

కాత్యాయనిగా దుర్గామాత



ఖిల్లాఘనపురంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



వీపనగండ్ల : కల్వరాలలో కాత్యాయనిదేవిగా..



శ్రీరంగాపురం ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు



ఆత్మకూర్‌లో స్వర్ణకారుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కొత్తకోట కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



అమరచింతలోని విఘ్నేశ్వర భవాని నగర్‌లో పూజలందుకుంటున్న భవానీ మాత

వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల శివాలాయం, ఆంజనేయ ఆలయంలో గురువారం కాత్యాయనిదేవిగా పూజలు చేశారు. పెబ్బేరులో కన్యాకాపరమేశ్వరి, సూగూరు రామాలాయం, శ్రీరంగాపురంలో కాత్యాయనిదేవిగా అలంకరించారు.

ఆత్మకూర్: పట్టణంలోని నీలకంఠేశ్వరస్వామి, కేశవస్వామి ఆలయాల ఆవరణలో స్వర్ణకారుల సంఘం, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో, బాలబ్రహ్మేశ్వరస్వామి, కోట్లాంజనేయస్వామి, అష్టలక్ష్మి, వాల్మీకినగర్‌లో, బీసీకాలనీలో గురువారం అమ్మవారు కాత్యాయనిదేవిగా, శ్రీ మహాలక్ష్మిదేవిగా దర్శనమిచ్చారు.

కొత్తకోట రూరల్: పట్టణంలో అంబభవానీ ఆలయంలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో కాత్యాయనిదేవిగా భక్తులకు అలంకరించారు. కానాయపల్లి గ్రామ శివారులో దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో జ్ఞానాంబికాదేవి వనదేవతగా భక్తులకు దర్శనమిచ్చారు.

వీపనగండ్ల : మండలంలో కల్వరాలలో కాత్యాయనిదేవిగా భక్తులు అలంకరించారు. కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలకేంద్రంలో శ్రీరంగనాయకస్వామి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మీదేవిగా భక్తులు అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అమరచింత: పట్టణంలో శ్రీకృష్ణనగర్‌లోని కాళికామాత ఆలయంలో, విఘ్నేశ్వరకాలనీలో భవానినగర్‌లో కాత్యాయనిదేవిగా భక్తులు అలంకరించారు. శివచౌడేశ్వరి ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని ఆయా మండపాల్లో ప్రతిరోజు అమ్మవారి దగ్గర భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు



పాన్‌గల్‌లో ఇంటి నిర్మాణాన్ని కలెక్టర్ ఆదర్శ్‌సురభి

పాన్‌గల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో మండలం పురోగతి లేకపోవడంపై కలెక్టర్ ఆదర్శ్‌సురభి మండలస్థాయి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పాన్‌గల్, బుసిరెడ్డిపల్లి గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు, పీఎం ఆవాస్‌యోజన సర్వే తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో పీఎం ఆవాస్ యోజన సర్వే, ఇల్ల నిర్మాణాల్లో చాలా వెనుకబడి ఉందన్నారు. ఇప్పటికే ఎంపీడీఓ వేతనం నిలిపివేసిన మార్పు రాకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనిచేయకపోతే చర్యలు తప్పవన్నారు. సిబ్బంది లేకపోతే అదనంగా జీపీఓలు నియమించుకొని ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. పాన్‌గల్‌లో లబ్ధిదారులు అలివేలమ్మను ఇసుకను ఎంత రేటుకు తీసుకున్నారని ఆమెను అడిగితే రూ.4,500 తీసుకున్నానన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ సత్యనారాయణరెడ్డిని ప్రశ్నిస్తు అంత ఎక్కువ రేటు తీసుకుంటే అధికారులు మీరు ఏం చేస్తున్నారని లబ్ధిదారులకు తక్కువ రేటుకు ఇసుకను ఇప్పించాల్సిన బాధ్యత మీపై ఉన్న ఏమి చేస్తున్నారని ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి కార్యదర్శి రోజుకు 30 ఇళ్లను సర్వే చేసి జియో ట్యాగింగ్ చేయాలన్నారు. బుసిరెడ్డిపల్లిలో పంచాయతీ కార్యదర్శికి ఆన్‌లైన్ సర్వేపై సరైన అవగాహన లేకపోవడం, అలసత్వం ప్రదర్శించిన కారణంతో కార్యదర్శికి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ విఠోబా, తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ గోవింద్‌రావు, కార్యదర్శులు నరేష్‌గౌడ్, మహేష్ పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వనపర్తి: జిల్లా కేంద్రంలో ప్రజల ఆరోగ్యం కోసం అందుబాటులోకి తెస్తున్న ఇండోర్ స్టేడియాన్ని ప్రజలు సద్వినియోగించుకునేలా అన్ని రకాల సదుపాయాలను కల్పించాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. వనపర్తి పట్టణంలో కలెక్టర్ నిధులతో ఇండోర్ స్టేడియంలో చేస్తున్న పునరుద్ధరణ పనులను గురువారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేడియంలో నూతన బ్యాడ్మింటన్ కోర్ట్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్, జిమ్ గదుల్లో కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట డీవైఎస్‌ఓ సుధీర్‌రెడ్డి, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజినీర్ మల్లయ్య, తదితరులు ఉన్నారు.

'అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు'



కొత్తకోటలో చలో హైదరాబాద్ వెళ్తున్న కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు

కొత్తకోట: అంగన్‌వాడీలను పోలీసుల చేత అరెస్టు చేయించి ఉద్యమాలను అడ్డుకోవడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని సీఐటీయూ జిల్లా కోశాధికారి బొబ్బిలి నిక్సన్ విమర్శించారు. గురువారం కొత్తకోట పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాలో పాల్గొని వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు చలో హైదరాబాద్ సెక్రటేరియట్ వెళ్తున్న వారిని ఎక్కడికక్కడే అరెస్టు చేసి నిర్బంధించారన్నారు. గత చంద్రబాబు హయాంలో అంగన్‌వాడీలపై గుర్రాలతో తొక్కించి నీటి ఫిరంగులతో దాడి చేసిన అంగన్‌వాడీల పోరాటం ఆగలేదని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రీ ప్రైమరీ పీఎం విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా నెలకు రూ.18వేల వేతనం అమలు చేయాలని గత 24 రోజుల సమ్మె వేతనం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను జీవో నెంబర్ 8 సవరించాలన్నారు. అలాగే మూడు నెలల పీఆర్సీ, 11నెలల ఏరియర్స్ డబ్బులు వెంటనే చెల్లించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు వనజ, నిర్మల, రమాదేవి, అన్నపూర్ణ, రేవతి, ప్రశాంతి, ఉష, సునీత, మన్నెమ్మ, జయలక్ష్మి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు తగదు

వీపనగండ్ల: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో నిరసనకు వెళ్తున్న అంగన్‌వాడీలను పోలీసులు అదుపులోకి తీసుకోవడం సరైన పద్ధతి కాదని సీఐటీయూ మండల నాయకుడు ఆశన్న, సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి అన్నారు. న్యాయపరమైన డిమాండ్లను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

సాయిచంద్‌రెడ్డికి టీచర్ ఎక్సలెన్స్ అవార్డు




టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డును అందుకుంటున్న ఉపాధ్యాయుడు సాయిచందర్‌రెడ్డి

కొత్తకోట రూరల్: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం–2025 సందర్భంగా పెద్దమందడి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సాయిచందర్‌రెడ్డి ప్రతిష్టాత్మక టీచర్ ఎక్సలెన్స్ అవార్డు–2025 (టీఈఏ–2025) అందుకున్నారు. హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియం భాస్కర ఆడిటోరియంలో జరిగిన అవార్డు ప్రధానోత్సవంలో ప్రముఖ సినీనటులు రఘు, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా శారద ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పట్నం కమలా మనోహర్ మాట్లాడుతూ.. విభిన్న బోధన పద్ధతుల ద్వారా విద్యార్థుల్లో అభ్యసనాన్ని సులభతరం చేసినందుకు అవార్డు అందజేశామన్నారు.

'ఉపాధి' సోషల్ ఆడిట్

గోపాల్‌పేట: ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం 01-04-2024 నుంచి 31-03-2025 వరకు ఉపాధిహామీ పనులకు సంబంధించి ఎంపీడీఓ భవాని ఆధ్వర్యంలో డీఆర్‌డీఓ ఉమాదేవి సమక్షంలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. 31.03.2025 వరకు మండలంలో మొత్తం రూ.5.44కోట్ల ఖర్చు అయిందని వివరించారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ సత్యనారాయణరెడ్డి, ఏపీఓ రహీం, క్యూసీ నాయుడు, ఎంపీడీఓ భవాని, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూరాల ప్రాజెక్టు రహదారిపై మొసలి



ప్రాజెక్టు రహదారిపై సంచరిస్తున్న మొసలి

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు రహదారిపై బుధవారం రాత్రి మొసలి సంచరిస్తుండటంతో రహదారిపై వెళ్తున్న ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ప్రాజెక్టు ఎడమ కాల్వ పరిధిలో మొసలి ప్రధాన రహదారిపై దాటే ప్రయత్నం చేస్తున్న దృశ్యాలను ప్రయాణికులు తమ తమ సెల్‌ఫోన్‌లో బంధించి సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేశారు. బ్యాక్‌వాటర్‌లో ఉండాల్సిన మొసళ్లు ఇలా బయటకు వస్తున్నాయని జాలర్లు తెలిపారు.

ముగిసిన ఉచిత వైద్యశిబిరం




పాన్‌గల్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పాన్‌గల్: పీహెచ్‌సీలో స్వస్థనారీ స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా గురువారం ఉచిత వైద్యశిబిరం విజయవంతమైనట్లు డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన మహిళలకు జనరల్ మెడిసిన్ వైద్యుడు డా.సతీష్ ఆధ్వర్యంలో హిమోగ్లోబిన్, షుగర్, బీపీ వంటి పరీక్షలను 121 మందికి నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్‌ఎల్‌హెచ్‌పీ వైద్యులు లారెన్స్, శ్రీకాంత్, వైద్యసిబ్బంది శాంతమ్మ, సుమనశ్రీ, సతీష్, మదన్ గోపాల్, రాంచందర్, జయమ్మ, శాంతి, డాటాఎంట్రీ ఆపరేటర్ వెంకటేష్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్యశిబిరం..

వీపనగండ్ల: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు. చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుడు మధు చక్రవర్తి పాల్గొని రోగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి సూచనలు ఇస్తారని మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

తప్పని యూరియా కష్టాలు



యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

అమరచింత: రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. ప్రతినిత్యం యూరియా కోసం రైతు ఆగ్రో సేవా కేంద్రాలకు తరలి వస్తూ యూరియా స్టాక్ లేదని తెలిసి వెనుదిరుగుతున్న పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. మండలంలోని వివిధ గ్రామాల రైతులు యూరియా కోసం గత నాలుగు రోజుల కిందట ఇచ్చిన టోకెన్లను తీసుకుని గురువారం వచ్చారు. వీరితో పాటు యూరియా కోసం అధికసంఖ్యలో రైతులు తరలిరావడంతో ఆగ్రోసేవా కేంద్రం రైతులతో కిక్కిరిసింది. కేవలం రూ.300 బస్తాల యూరియా వచ్చిందని ఉన్న వాటిని రైతులకు ఇవ్వడానికి పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారుల సహకారంతో సరఫరా చేశారు.